www.kandilinews.com
# కందిలి
న్యూస్.. దారిచూపే దీప శిఖ
మంగళవారం | 26.05.2026 సంపుటి: 01 | సంచిక: 258 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800



మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి



# 70 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి!

ప్రత్యేకంగా 8 ఏళ్ల లోపు చిన్నారులకు సైకిల్స్ పంపిణీ

వచ్చే ఆదివారం సైకిల్స్ అందించేందుకు వీలుగా మరో 156 మంది చిన్నారులకు టోకెన్స్ పంపిణీ

సంగారెడ్డిలో ఇప్పటి వరకు 400మందికి సైకిల్స్ అందజేత

పేర్లు నమోదు చేసుకున్న వారికి విడతల వారీగా సైకిల్స్ అందిస్తామన్న జగ్గారెడ్డి

3 లో



# రైతు గోస... బీజేపీ భరోసా!

- గజ్వేల్ వ్యవసాయ మార్కెటు యార్డును సందర్శించిన బీజేపీ నేతలు, ప్రజాప్రతినిధుల బృందం
- వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచి అన్నదాతలకు ఊరట కల్పించాలని డిమాండ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాక
- క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందుల పరిశీలన
- రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ విమర్శలు

4 లో

- సీఎం రేవంత్ రెడ్డికి చురకలంటించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- రెండు రోజులు సమయమిస్తున్నాం.. కొనుగోళ్లలో వేగం పెరగకుంటే వేలాది రైతులతో కలెక్టరేట్ ముట్టడిస్తాం!
- ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వానిది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్ అంటూ విమర్శ
- సిద్దిపేట జిల్లా ఎన్సాన్ పల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు అరిగోస పడుతున్నారని ఆగ్రహం
- వడ్లు కొనడం చేతకాక కేంద్రంపైన నెపాన్ని నెడుతున్నారని ఫైర్



గారడీ మాటలు, ఢిల్లీ ట్రిప్పులు ఆపి..

2 లో

# కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచండి



గారడీ మాటలు, ఢిల్లీ ట్రిప్పులు ఆపి..

# కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచండి

- సీఎం రేవంత్ రెడ్డికి చురకలంటించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- రెండు రోజులు సమయమిస్తున్నాం.. కొనుగోళ్లలో వేగం పెరగకుంటే వేలాది రైతులతో కలెక్టరేట్ ముట్టడిస్తాం!
- ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వానిది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్ అంటూ విమర్శ
- సిద్దిపేట జిల్లా ఎన్సాన్ పల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు అరిగోస పడుతున్నారని ఆగ్రహం
- వడ్లు కొనడం చేతకాక కేంద్రంపైన నెపాన్ని నెడుతున్నారని ఫైర్

**కందిలి, సిద్దిపేట**

"రెండు రోజుల్లో వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే, నేనే స్వయంగా వేలాది మంది రైతులతో కలెక్టరేట్ ను ముట్టడిస్తాను. వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వానిది మిషన్ మోడ్ కాదు, కమిషన్ మోడ్.గారడీ మాటలు, ఢిల్లీ ట్రిప్పులు ఆపి.. కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచండి సీఎం రేవంత్ రెడ్డి. క్వింటాలుకు 5 కిలోల తరుగుతో రైతులు నిలువునా మోసపోతున్నా మంత్రులకు, అధికారులకు పట్టింపు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరితో లక్షలాది మంది రైతులు అరిగోస పడుతున్నార"ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా ఎన్సాన్ పల్లిలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.

### హరీశ్ రావు కామెంట్స్:

- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు అరిగోస పడుతున్నారు. ఈ ప్రభుత్వానికి రైతులంటే పట్టింపు లేదు. లెక్కలేదు. యూరియా సరఫరా, కరెంటు, రైతుబంధు ఇవ్వడంలో ఫెయిల్ అయిన ప్రభుత్వం ఇది. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను కొనడంలో కూడా పూర్తిగా విఫలమైంది.
- గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కాదు, ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి.. ఇలా ఏ ముఖ్యమంత్రి ఉన్నా కూడా రైతులకు ఇంత బాధ, కష్టం ఎన్నడూ రాలేదు.
- రాష్ట్రంలో కోటి 40 లక్షల టన్నుల దిగుబడి వస్తుంటే.. నిన్నటి దాకా 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇవాళ 70 లక్షల టన్నులే కొంటామంటున్నారు. అంటే మిగతా 70 లక్షల టన్నులు రైతులు దళారులకు అమ్ముకుని నష్టపోవాలా?
- వడ్లు కొనడం చేతగాక కేంద్రం మీద నెపం నెడుతున్నారు. కేంద్రం కొనకపోతే ఆనాడు కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో ధర్నా చేసి కేంద్రం మెడలు వంచారు.
- కేంద్రం కొనకున్నా, రైతులకు నష్టం కలగకుండా కేసీఆర్ కొనుగోలు చేశారు. మీకు చేతనైతే ఢిల్లీ పోయి కొట్లాడండి. కానీ రైతులను నట్టేట ముంచకండి.
- కొనుగోలు కేంద్రాల్లో తరుగు తీస్తే తోలు తీస్తానని సీఎం రేవంత్ రెడ్డి, కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి ఉత్తమ్ ఏసీ రూముల్లో కూర్చుని డైలాగులు కొడుతున్నారు.
- నా నియోజకవర్గంలోని నంగునూరు, ఖానాపూర్, వెంకటాపూర్, నర్మెట, పాలమాకుల, సిద్దిపేట అర్బన్, ఎన్సాన్ పల్లి, మిట్టపల్లి, రావురూక్ల, రాఘవాపూర్, మల్లారం, సికిందలాపూర్ తదితర గ్రామాల నుంచి రైతులు నాకు ఉదయం నుంచి ఫోన్లు చేస్తున్నారు.మిల్లుల్లో బస్తాకు 43 కిలోలు పెడితేనే దించుకుంటామని మిల్లర్లు రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు.
- దీనివల్ల ఎకరాకు 150 కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని డీఎస్ఓ దృష్టికి తీసుకెళ్తే మీరు మిల్లర్లతోనే మాట్లాడుకోండి అని బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారు.
- ఏ ఒక్క మంత్రి కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. రైతులు మిట్టపల్లి,నంగనూరు, చిన్నకోడూరులో రాస్తారోకోలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కనికరం లేదు.రోహిణీ కార్తె వచ్చినా కొనుగోళ్లు కాక వడ్లు కల్లాల్లోనే ముగ్గుతున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1012 మంది రైతులు కల్లాల్లో ప్రాణాలు విడిచారు.
- సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో కూర్చుని మిషన్ మోడ్ అని పేపర్ టైగర్ లా డైలాగులు కొడుతున్నారు. మీరు వడ్లు కొనే పద్ధతి చూస్తే నత్తలు కూడా సిగ్గుపడతాయి. ముఖ్యమంత్రిది మిషన్ మోడ్ కాదు..కమిషన్ మోడ్. నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగులో రైతుల కష్టాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం.
- మార్చి 22న సిద్దిపేట గడ్డ మీద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చి 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుబంధు వేస్తా అని సీఎం చెప్పాడు. ఇవాళ్టికి 63 రోజులైంది.ఇంతవరకు రెండు ఎకరాల వారికి తప్ప మిగతా రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు రాలేదు.
- రెండు, మూడు రోజుల్లో వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచి, తరుగు లేకుండా కొని, లారీలు, గన్నీ బ్యాగులు పంపకపోతే.. స్వయంగా నేనే వేలాది మంది రైతులను వెంటబెట్టుకుని వెళ్లి నిరవధిక ధర్నా చేపట్టి కలెక్టరేట్ ను దిగ్బంధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను.







## చిన్నారులతో ముచ్చటిస్తూ..!

సైకిల్స్ పంపిణీ సందర్భంగా జగ్గారెడ్డి చిన్నారులతో ముచ్చటిస్తూ సరదాగా గడిపారు. వారితో కరచాలనం చేస్తూ, హాయ్ చెబుతూ వారితో కలిసిపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు కూన సంతోష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# 70 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి!

- ప్రత్యేకంగా 8 ఏళ్ల లోపు చిన్నారులకు సైకిల్స్ పంపిణీ
- వచ్చే ఆదివారం సైకిల్స్ అందించేందుకు వీలుగా మరో 156 మంది చిన్నారులకు టోకెన్స్ పంపిణీ
- సంగారెడ్డిలో ఇప్పటి వరకు 400మందికి సైకిల్స్ అందజేత
- పేర్లు నమోదు చేసుకున్న వారికి విడతల వారీగా సైకిల్స్ అందిస్తామన్న జగ్గారెడ్డి

కందిలి, సంగారెడ్డి

సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సైకిల్స్ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా మరో 70 మంది చిన్నారులకు జగ్గారెడ్డి సైకిల్స్ పంపిణీ చేశారు. 8 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సైకిల్స్ అందించేలా ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 400 సైకిల్స్ పంపిణీ పూర్తయ్యింది. తమ కార్యాలయంలో ఆధార్ జిరాక్స్ ఇచ్చి, పేర్లు నమోదు చేసుకున్న అందరికీ విడతల వారీగా సైకిల్స్ అందిస్తామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



**మరో 156మందికి.. టోకెన్స్ పంపిణీ**

సైకిల్స్ పంపిణీ కార్యక్రమం వద్దకు వచ్చి, గతంలోనే తమ పేర్లను నమోదు చేసుకున్న 156మంది చిన్నారులకు జగ్గారెడ్డి టోకెన్స్ అందించారు. వచ్చే ఆదివారం వారికి సైకిల్స్ అందిస్తామని చెప్పారు.










# రైతు గోస... బీజేపీ భరోసా!

- గజ్వేల్ వ్యవసాయ మార్కెటు యార్డును సందర్శించిన బీజేపీ నేతలు, ప్రజాప్రతినిధుల బృందం
- వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచి అన్నదాతలకు ఊరట కల్పించాలని డిమాండ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ .రాంచందర్ రావు సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాక
- క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందుల పరిశీలన
- రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ విమర్శలు

**కందిలి, గజ్వేల్**





కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు అండ నిలబడటమే లక్ష్యంగా బీజేపీ నేతలు క్షేత్రస్థాయికి కదిలారు. ''రైతు గోస - బీజేపీ భరోసా''కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సహా పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి మల్క కొమురయ్య తదితరులు హాజరయ్యారు.

**రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం!**

ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వడ్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోందన్నారు. వారాలు దాటి నెలల పాటు రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. తరుగు పేరిట 5కిలోలకు పైగా రైతుల నుంచి దోపిడీ చేస్తున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యం కల్లాల్లోనే తడిసి ముద్దవుతోందని, వేగంగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపించారు.







# ప్రకృతి పరిరక్షణ... ప్రతి పౌరుడి బాధ్యత !



- పిలుపునిచ్చిన మంత్రి అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అని స్పష్టం చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ
- సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన అటవీ శాఖ భవనం ప్రారంభోత్సవం
- హాజరైన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**కందిలి, సంగారెడ్డి**

అడవుల నరికివేత,పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి,పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.

**అందరం కలిసి..**

**బాధ్యతగా పనిచేద్దాం!**

"ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలం. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం లాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడనున్నాయ"ని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

**పాల్గొన్నవారు ఇలా!**

ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.








# పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి... సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం!

- **అదానీ, అంబానీల కోసం తప్ప ప్రజల కోసం ప్రధాని మోదీ చేసిందేమీ లేదు**
- **విదేశాల్లో పర్యటనలే తప్ప, స్వదేశం ప్రజల బాధలు పట్టవా?**
- **సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**
- **ఇంధన ధర పెంపునకు నిరసనగా సంగారెడ్డిలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం**

**కందిలి, సంగారెడ్డి**

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు విమర్శించారు. అదానీ, అంబానీల కోసం తప్ప ప్రజల కోసం ప్రధాని మోదీ చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై సీపీఎం అధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

**దేశ ప్రజల బాధలు పట్టవా!**

ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ విదేశాల్లో పర్యటనలే తప్ప స్వదేశంలో ప్రజలు పడుతున్న బాధలు ప్రధాని మోదీకి పట్టడం లేదన్నారు. వారంలో 4 సార్లు పెట్రోల్,డీజిల్ ధరలు పెరిగాయని తెలిపారు. ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల తర్వాత ధరలు పెంచి ప్రజలకు వాతలు పెట్టడం అన్యాయమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచేలా ధరలు పెంచుతున్న మోదీ ప్రభుత్వం గద్దె దిగాలన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పుడు కూడా దేశంలో బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించలేదన్నారు. చమురు కంపెనీలు నష్టాల్లో ఉన్నాయని చెబుతూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నారన్నారు.

**పేద ప్రజల..**
**సంక్షేమాన్ని విస్మరించారు!**

పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాని నరేంద్ర మోదీ, అంబానీ అదానీలకు అనుకూలంగా పరిపాలన కొనసాగిస్తున్నారని గొల్లపల్లి జయరాజు ఆరోపించారు. పెంచిన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం మొండిగా వ్యవహరిస్తే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ ధరలను తక్షణమే తగ్గించాలని, లేకపోతే రానున్న కాలంలో ప్రజల మద్దతుతో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటే రీతిలో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్,కృష్ణ,నాయకులు బాగారెడ్డి, ప్రసన్న, విఠల్,లక్ష్మణ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com